# నిరాశ

శ్రీ జ. వేం. వల్లభరావు

సాయంకాలం 6 గంటలు కావచ్చింది. ఇంకా యెన్నిగంటలకి చేరతామో కదా. కనుచూపు మేరలో యెక్కడా దీపాలు కన్పించడం లేదుకదా అని యేదో వాపోస్తూ మా మామతోకూడా బండిలో కూర్చు న్నాను. ముసలివాడవడంచేత మావకి నాటు ప్రయాణం కష్టంగా లేదు. మేము వెళ్ళుతున్నది వెంకటాపురాగ్రహారము. అక్కడ మా భూములున్నాయట వాటిని నాకు చూపించి మా రైతుల దగ్గిర పంట తీసుకోరావడానికి మా అబ్బి మామ నన్ను అక్కడికి తీసుకో వెళ్తున్నాడు. అప్పుడు నాకు సుమారు పది హేడేళ్లుంటాయి.

ఎలాగైతే నేమి రాత్రి పదిగంటలకి దూళి దూసరాలతో నిండుకోని ఓ పెద్ద అరుగుల యింటిదగ్గిర మాబండి నిలచింది. మా మావ బండిలోనుంచి దిగుతుండగానే యింట్లో నుండి ఓ తాతవచ్చి 'ఓరే బావా పంతులు బాబొచ్చారురా' అని కేకవేశాడు. కొంత సేపటికి మాచుట్టూ రైతులు పోగయారు.

'బాబూ యీకుఱ్ఱా డెవడు'

'మా వెంకయ్య బావ పెద్దకొడుకు. పెద్దవాడయాడు కదా వాడి వ్యవహారాలు వాడి కప్ప చెపుదామని తీసుకొచ్చాను.'

'ఏంరా సూరయ్య బావా కుఱ్ఱాడు అచ్చంగా పెద్దబాబులాగ నున్నాడు కాద్రా?' అని వాళ్ళలో నొకడన్నాడు. మానాన్న చనిపోయి నాలుగు సంవత్సరాలు కావచ్చింది. నాన్నగారితరువాత మావ్యవహారాలన్నీ మామే నడుపుతున్నాడు. ఆరోజు మామావ నన్ను వాళ్ళకి చూపిందాకా నేను బాబునని నాకు తెలియదు. మాటలు ముగిసాయి మేమా రాత్రి మాపెద్ద రైతుగారింట్లో బస చేశాము.

## 2

పట్టణాలలో కాలేజీ హాస్టళ్ళలో నీటుగా ఉన్న గదులలో మెసలిన నాకు దూళి దూసరాలతోను, పొగతోను నిండి ఉన్న ఆయింట్లో కూర్చోడం యెంతో కష్టం అనిపించింది మావ మాత్రం ఆతాతతో యేదో మాట్లాడుతున్నాడు. ఆముదుసలి రైతుల కష్టాలన్నీ వెళ్ళబోస్తున్నాడు మా వాడు మాత్రం డబ్బు యివ్వక తప్పదని, మధ్య మధ్య అంటున్నాడు. నేను ఓమూల కఱ్ఱ పెట్టెమీద "రేపటి రోజు యెలాగు గడుపుతానో కదా' అని ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇంతలో యేవో పళ్ళూ, నీళ్ళూ పట్టుకోని ఒక పిల్లవచ్చింది సుమారు పదిహేను, పదహారు సంవత్సరా లుంటాయి. 'అమ్మా యిక్కడెట్టు' అని తాత అన్నాడు. నాచికాకు మరచిపోయాను 'బాబూ ఫలహారం చేద్దుగానిరా' అని మావ పిలిచాడు. పళ్ళు నాకంత ఆకర్షణీయంగా లేకపోయినా వాటిని తెచ్చిన స్త్రీ నన్నాకర్షించింది. ఆ పళ్ళ దగ్గిరకు వెళ్తే ఆమె ముఖం పూర్తిగా చూడగలను కదా అన్న ఆశపుట్టింది. దూళితో నిండిన వస్త్రాల కన్నా అవి భద్రపరచిన హృదయం నన్నాహ్వానించింది. నా మనస్సులో అనేక భావాలు శరవేగాన్న పరు

గెట్టాయి. దీనికి కారణం యేమిటి? ‘నేనింతకు పూర్వం అనేకమంది స్త్రీలను చూశానే. నాలో యీభావ లెప్పుడు పుట్టలేదే యీ రోజు యీ విపరీత మేమిటి’ అని దీర్ఘంగా ఆలోచిస్తూ పళ్ళుదరి చేరాను.

ఏమీ రవివర్మ వ్రాసిన చిత్రం కాదు కదా. నిజంగా సజీవమైన స్త్రీయేనా లేక శిల్ప చాతుర్యమా? మాట్లాడించి చూద్దామనుకున్నాను గాని నాకే అధికారం ఉంది? ఆమె సౌందర్యం చూపించడానికే భగవంతుడు నన్నా పల్లెకు తీసుకొచ్చాడని తలచాను. స్త్రీలు నిజంగా యీరీతిగానే మొదట ఈశ్వరునిచే సృష్టించబడియుంటారు. క్రైస్తవ మతములో మాదిరి మన యీడము. యీ వులుకూడా యేవో తప్పులు చేయడం చేత కురూపులుగాను దుర్బుద్ధులుగాను తయారై యారనిపించింది. నా ఫలహారము పూర్తి అయినదాకా ఆమె అలా నిలచిపోయింది నన్నామె చూసిందా? లేదా! చూడలేదేమో —నాదెంత పాపపు జన్మ అన్న విచారం కూడా వేసింది.

## 3

తెల్లవారు జామున నాలుగు గంటలయింది. అరుగుమీద పడుకున్నా. సుందర విగ్రహం నాముందరనుండి కదలలేనట్టు కనిపించింది. త్వరగా లేచి ఆమె యేంచేస్తున్నదో చూడాలన్న కుతూహలం పుట్టింది. నిద్రనుండి లేవకపోతే చేయితో తట్టి లేపవలెనన్న ఊహ జనించింది. నేనింకా నాడూహా ప్రపంచంలోనే తిరుగుతున్నాను, యింతలో కోనేరునుండి పదిమందితోకూడి నీళ్ళు తెస్తున్నాది. ఇంటిలో ఆమెమీద యెవరో అధికారం కూడా చేస్తున్నారు. ఒకరు పూవులాగ ప్రేమించిన వస్తువును మరొకరు పురుగులాగ చూతురు కదా!

కాలకృత్యాలు తీరాయి. మా మామ ముందర ఒక పెద్ద ధాన్యపు కుప్ప పోగు చేస్తున్నారు. ఎండ తీక్షణంగా నుంది. ఆడ మొగవితక్షణ లేకుండా చమటలు కార్చుకుంటూ గంపలతో ధాన్యం కుప్పలుగా వేస్తున్నారు. అందరితోపాటు లక్ష్మికూడ ధాన్యం తెచ్చి కుప్పలో పోస్తున్నాది. అందరి కష్టం నాహృదయం దాక పోలేదుగాని ఆమెదీనపు దృష్టి నామనస్సుకి ముల్లులాగ గుచ్చుకుంది. ‘మామా’ అని ఒక్కసారిగా అరచాను. అందరు నావేపు తిరిగారు ఆమెకూడ నాచెంతకి ఒక్క పరుగునవచ్చింది. మరి నా నోటిమాట రాలేదు.

ధాన్యం కొలవడం ముగియగానే మేము మాబండి యెక్కాం. లక్ష్మి నావేపు నిరాశతో చూస్తూ నిలబడింది. ఆమె చూపులో ఒక రకమైన కోపంకూడ నాకు గోచరమైంది. “మా బ్రతుకు లింత దైన్యములా! యెండవానల కోర్చి రాత్రింబవళ్ళు కష్టపడి పండించిన పంటకు మీరా అనుభవించువారు. నా సౌందర్యమేనా నీ హృదయం కరిగించలేక పోయిందా” అన్న . భావం ఆ చూపులు తెలియజేశాయి. చేయునది లేక ముఖం మరోపక్కకు త్రిప్పివేశాను.